


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### బాండ్ - ఫ్యామిలీ బాండ్

**నాకు బాగా తెలిసిన పెద్దమనిషి ఒకాయన "సంక్రాంతి పండక్కి** ఒక వారం ఊరెళ్తున్నాం, నేనూ మా బంధువులూనూ" అన్నాడు.

"ఏదైనా తీర్థయాత్రా?" అడిగాను.

"అబ్బే! మా కుటుంబాలన్నీ ఒకచోట కలిసి వారం రోజులు గడపాలని బెంగుళూరు వెళుతున్నాం" అన్నాడు.

ఆ తరువాత ఆ విషయమ్మై నాలోని రచయిత్రి కాసేపు జీడిపాకంలా సాగదీసిన తరువాత "ఫ్యామిలీ బాండ్స్ పటిష్ఠంగా ఉండడానికి, ప్రతి ఏడూ, కొడుకులూ, కోడళ్ళూ, నేనూ, మా ఆవిడా, నా చెల్లెళ్ళూ, బావగార్లూ, వాళ్ళ పిల్లలూ, బావగార్ల తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ, మా అమ్మా, అత్తగారూ, వాళ్ళ వాళ్ళ రెస్పెక్టివ్ అత్తగార్లూ అంతా కలిసి వెళుతున్నాం" అన్నాడు.

ఇప్పటికి నాకు అర్థమైంది. దూరం అవుతున్న బంధుత్వాలూ, పలచన అవుతున్న అనుబంధాలూ దృష్టిలో పెట్టుకుని ఇలా అంతా ఒక చోట చేరాలని ఆ పెద్దాయన ఆకాంక్ష!

బాగా కోట్లు గడించిన కుటుంబాలు కనుక అంతా కలిసి ఒకచోట కొన్ని రిసార్ట్స్ తీసుకుని, పిల్లా పీచూ, ముసలీ ముతకాతో "హాయికదా.. హాయికదా.. సమిష్టి జీవనమే హాయికదా!" అని గడిపేయచ్చు. ఇందులో గొడవేం లేదు. అక్కడున్న వారంలో ఆఫీసు వ్యవహారాలూ, ప్రొఫెషనల్ అండ్ బిజినెస్ వ్యవహారాలూ మూత పెట్టి, వీలైతే సెల్‌ఫోన్లు ఆఫ్‌చేసి, కుటుంబ సభ్యులతోనే గడపాలని నిబంధనట!

నాకు అనుకోకుండా 'బిగ్‌బాస్' కార్యక్రమం గుర్తొచ్చింది. కలర్స్ ఛానెల్‌లో ప్రసారమయ్యే ఈ కార్యక్రమంలో ఓ పధ్నాలుగు మంది దాకా సెలెబ్రిటీస్‌ని సెలెక్ట్ చేసి ఒక రిచ్ ఫర్నిష్డ్ హౌస్‌లో పెడతారు. వారికి టి.వీ కానీ సెల్‌ఫోన్లు కానీ న్యూస్ పేపర్లు కానీ, రేడియో కానీ, ఎలాటి బయట ప్రపంచపు సమాచారం అందకుండా చేస్తారు. లోపల వీళ్ళు ఎంటర్ అయిన రోజున ఒకర్ని ఒకరు గట్టిగా కౌగిలించుకుని, ఒకరి కళలని ఒకరు పొగుడుకుని జోక్స్ కట్ చేసుకుని బిగ్గరగా నవ్వుకుంటారు.

శుక్రవారందాకా 'చిలోపాలో'మని ఆడుతూ పాడుతూ పనిచేసుకుంటూ, మధ్య మధ్యలో బిగికౌగిలింతలూ, ముద్దులూ జెండర్ తేడా లేకుండా పెట్టుకుంటూ, మనని ఎంటర్‌టైన్ చేస్తారు.

శనివారం నాడు ఎలిమినేషన్ ప్రక్రియ ఉంటుంది. అంటే ఒక్కొక్క కంటెస్టెంట్, ఇద్దరు కంటెస్టెంట్ల పేర్లు ఎలిమినేషన్ కోసం ఇవ్వాలి. ఇది పద్ధతి. వీరందర్లో, ప్రజా ఓట్లు లెక్కింపు తర్వాత, తక్కువ వచ్చిన వారిని 'బిగ్‌బాస్' ఇంట్లోంచి పంపించేస్తారు. ఇలా చివరకు మిగిలిన ఒక వ్యక్తికి కోటి రూపాయిలు ప్రైజుమనీ ఉంటుంది.

ఈ బిగ్‌బాస్ సీజన్ అక్టోబర్ ఏ పధ్నాలుగునో మొదలయి, ఏ జనవరి రెండోవారంలోనో ముగుస్తుంది.

ఈ ప్రోగ్రాంలకి ఏంకర్లుగా, శిల్పాషెట్టీ, తరువాత అమితాబ్ బచ్చన్, ఆ తరువాత సల్మాన్ ఖాన్, ఈసారి సల్మాన్ ఖాన్, సంజయ్ దత్ ఇద్దరూ పాల్గొన్నారు.

ఈ ఏంకర్లు మాత్రం అప్పుడప్పుడూ ఆ 'గృహం'లోకి వెళ్ళొచ్చు. వారితో టీ.వీ. ద్వారా మాట్లాడొచ్చు. బిగ్‌బాస్ అనే వ్యక్తి స్వరం మాత్రం 'ఖంగు'న మోగుతూ ఉంటుంది. అతను ఎవరో? ఎలా ఉంటాడో ఎవరికీ తెలీదు. విధాతలా ఆ ఇంట్లో కంటెంస్టెంట్లు తలరాతలు రాస్తూ, తనదైన శైలిలో వాళ్ళు చేయాల్సిన కొన్ని విధులూ, వాటికి రివార్డులూ ఇస్తుంటాడు. నాకు నచ్చినదేవిటంటే, వాళ్ళు చేసిన పనులకి పాయింట్లు ఇచ్చి ఆ పాయింట్ల ప్రకారం వంట సామాగ్రి, ఇతర ఫుడ్ స్టఫ్స్ ఇస్తుంటాడు. ఎవరూ బద్ధకించి తమ పనులు ఎగ్గొటడానికి వీలుండదు. అలా చేస్తే, అతనితో బాటు మిగతా వారికీ రేషన్ కట్ అవుతుంది. అందుకే ఊర్కోరు.

'అహా!' సోమరిపోతులకి ఇలాంటి కొత్త రూల్స్ ఏమైనా మన ప్రభుత్వం ప్రవేశపెడితే ఎంత బావుంటుందీ?

ఇవన్నీ నేను చెప్పే పాజిటివ్ సైడ్స్.

ఇంక నెగిటివ్ చూడాలంటే, బిగ్‌బాస్ చూడాల్సిందే!

ఒక వారం బాగానే ఉంటారు. ఆ తరువాత ఒకరితో ఒకరు గొడవలు పడడం మొదలు అవుతుంది. ఆ గొడవలు ఒక కోడిగుడ్డుకోసమో.. చెమ్చాడు చక్కెర కోసమో కావచ్చు. లేదా ఇల్లు నేను నిన్న తుడిచాననీ, ఇవాళ నువ్వు తుడవాలనీ, లేదా, టాయిలెట్ క్లీన్ చెయ్యాలనో కావచ్చు. నెమ్మదిగా మొదలయి, 'అమ్మలూ, అబ్బలూ, పెళ్ళయితే వాళ్ళ మొగుళ్ళూ, పిల్లలూ, ప్రొఫెషనల్ లైఫులూ.. అన్నీ మధ్యలోకి తెచ్చి, ఒకరి మీదకి ఒకరు ఉరికి, మనం వినలేని అశ్లీలపు భాషలో, ఎన్నోసార్లు 'బీప్' అన్న సెన్సార్ కట్‌లతో, వీలైతే బాహాబాహీ పోట్లాడుకుని, ఒకరి రక్తం ఒకరు కళ్ళచూసుకునే పద్ధతిలో ఉంటుంది ఆ ఫైట్.

కానీ పాపం వారంతా సెలబ్రిటీలే. ఒకప్పటి సినీతారలూ, ఇప్పటి టీ.వి నటులూ, ఏంకర్లూ, పేరెన్నికగన్న నేరస్తులూ, వారి సంబంధీకులూ (చంబల్‌లో పధ్నాలుగు మందిని చంపిన సీమా పరిహార్, డానీ అనే దొంగా, నేరాల రాజు శోభారాజు పెళ్ళాంలాంటి వాళ్ళు) ఇందులో పాల్గొంటారు. ఈసారి ఏడెడ్ ఎట్రాక్షన్‌గా ఒక 'పోర్న్ స్టార్' సన్నీ లెనెన్‌ని కూడా తీసుకొచ్చారు.

ఈ ప్రోగ్రాం ప్రతిరోజూ రాత్రి పదిన్నర నుండీ పదకొండున్నర దాకా ప్రసారమయ్యేది. అంటే, పగలంతా విధులకి హాజరయి, అలసి పోయి ఇంటికొచ్చి, భోజనం చేసి, సేద దీరుతూ - టీ.వీ చూద్దామని సగటు మనుషులు అనుకునే టైంకి.. ఈ టీ.వి పెట్టగానే

"నోర్ముయ్.. నీ .. చంపేస్తా.. నీ పేగులు తీస్తా. బయట నీకెంతమంది బీప్ బీప్ బీప్ ఉన్నారో నాకు తెలుసే!"

"ఛీ నీ లాంటి వాడిని కన్న నీ బీప్ బీప్ .. నీకు సినిమా ఛాన్సులు ఎలా వస్తున్నాయో నాకు తెలుసురా!"

"టాక్ టు మై హాండ్." అని ఒకరు చెయ్యి చూపిస్తూ, ఎదుటి వారు చెప్పేది తను వినను అంటుంది.

"స్పేర్ మీ.." అంటూ ఇంకొక స్త్రీ నాటకీయంగా తనతో మాట్లాడొద్దు అంటుంది.

రాక్షసంగా ఇంట్లో వస్తువులూ, పాత్రలూ విరగ్గొడతారు. చేతిలో ఉన్న క్లీనింగ్ మాప్‌తో కొట్టడానికి వెళ్తుంటారు. రాత్రిళ్ళు చీకట్లో ఒకరి బెడ్ మీద ఒకరు దూరి గుసగుసలతో నేరాలు చెప్పుకుంటుంటారు. తెల్లారి వాళ్ళతో రాసుకునీ పూసుకునీ తిరుగుతుంటారు. రొమేన్స్‌లకీ, అశ్లీల చేష్టలకి కూడా కొదవ ఉండదు. ఒకరి మీద ఒకరు ఏమేం చెప్పుకున్నారో మనకి తెలుస్తూ ఉంటుంది. అందులో పాల్గొన్న వారికి తెలిసే అవకాశం లేదు.

ఒక ఇంట్లో ఇంతమంది వింత ప్రవృత్తులు ఉన్న వాళ్ళందర్నీ చేర్చి, తలుపులు మూసి, బయట లోకంతో సంబంధం లేకుండా చేస్తే, వారిలోని అసలు స్వరూపాలూ, నైజాలు బయటకొచ్చేస్తాయి. కెమెరా ముందు మేకప్‌తో కొన్ని గంటలపాటు నటించే ఈ నటులు, ఇలా ఓ యాభై సీ.సీ కెమేరాల ముందూ, అను నిత్యం మెడలో వేళ్ళాడ్తూ వారి మాటల్ని మనకి వినిపించే మైకులతోనూ, నటించలేక వారి వికృత స్వభావాలని మనకి చూపించేస్తుంటారు.

నిజమైన నరకం మాత్రం, ఈ ప్రోగ్రాంలో పాల్గొన్న అభ్యర్థుల కుటుంబ సభ్యులదే!

"నువ్వు నీ పెళ్ళామ్ని మోసం చేసి ఫలానా దానితో తిరిగావు" అని ఒకత్తి తన మొగుడ్ని తిడుతుంటే, ఇక్కడ ఇంట్లో టీ.వీ సెట్టుముందు తన పిల్లలతో కూర్చుని చూస్తున్న భార్యకి ఎలా ఉంటుందీ?

ఒక కోటీశ్వరుడ్ని ఇంకోడు,

"నువ్వు నా గుడ్లు దొంగిలిస్తున్నావు. నీ అంత కక్కుర్తి వాడిని నేను ఎక్కడా చూడలేదు. నీ అంత నీచుడు.. గుడ్డేం ఖర్మ? ఏదైనా దొంగిలిస్తాడు. ఛీ! నా బిచ్చం అనుకుని తిను" అని తిడుతుంటే,

ఇక్కడ పనివాళ్ళ ముందు ఆ కోటీశ్వరుడి తల్లితండ్రులూ, భార్యా, పిల్లలూ ఎలా ఫీల్ అవుతారు?

"నిన్నరాత్రి నువ్వు వాడితో స్విమ్మింగ్‌ఫూల్‌లో ఏం చేసావో నేను చూసాను." అని ఒక అమ్మాయిని ఇంకొక అమ్మాయితో అంటుంటే, అక్కడ ఆ అమ్మాయి ఇంట్లో భర్తా, అత్త మామలూ, పిల్లలూ ఏమనుకోవాలి?

ఇలాంటి నరకం కుటుంబ సభ్యులకి ఇచ్చి, వీరంతా ఒకరి తర్వాత ఒకర్ని ఎలిమినేట్ చేయించి, తాము మాత్రం చివరిదాకా ఉండి ప్రైజ్ మనీ ‘కోటి‘ రూపాయలూ గెలవాలని యుక్తులూ, కుయుక్తులూ పన్నుతుంటారు.

అంటే తమ వ్యక్తిగత జీవితాలు పణంగా పెట్టి, కోటి కోసం ఆడుతుంటారు. ఆ మూడు నెలల షో టైం అయి ఇంటికొచ్చేసరికి, పెళ్ళిచేసుకోబోయే మొగుడి మనసు మారిపోయి ఓ అమ్మాయి పెళ్ళి కేన్సిల్ అయిపోవచ్చు.

ఇంకొక వ్యక్తి భార్య విడాకులు కోరుతూ లాయర్ నోటీస్ పంపించవచ్చు.

ఏ వీక్ హార్టెడ్ పేరెంట్సో అయితే హార్ట్ ఎటాక్ వచ్చి పోనూ వచ్చు!

పిల్లలు మానసికంగా స్కూళ్ళలో, ఇంటి దగ్గర ఆడుకునేటప్పుడూ తమ తల్లిదండ్రుల గురించి చెడుకబుర్లు విని, హింసని తట్టుకోలేక రోగులుగా మారనూవచ్చు.

సమాజానికి ఇలాంటి రియాల్టీ షోస్ ఏవిధంగా ఉపయోగమో నాకైతే అర్థం కాలేదు.

కొన్ని కోట్లు ఖర్చుపెట్టి, ప్రతి ఏటా ఈ రియాల్టీ షో నిర్వహిస్తారు. ఇందులో అతిథి స్టార్స్‌కి కూడా పెద్ద మొత్తంలో రెమ్యునరేషన్స్ ఉంటాయిట.

ఇవి టీ.వి, బిగ్‌బాస్ రియాల్టీ షో గురించిన వివరాలు.

ఇంక వాస్తవానికి వస్తే, మనమూ, మన బంధువులూ ఏ రామారావు కొడుకు పెళ్ళి అనో, రాజమండ్రినో, అన్నవరమో, మొత్తం ఒక కుపే బుక్ చేయించుకుని వెళుతుంటాం.

రైల్లో వరహాలు బామ్మతో ఏ చిన్న అత్తయ్యో "రామం కొడుక్కి నీ మనవరాలు వెంకట లక్ష్మిని ఇచ్చి అయిన సంబంధం చెయ్యచ్చుగా. ఇలా పరాయి సంబంధం ఎందుకు చేస్తున్నాడూ?" అంటుంది.

"ఏమోనే పెద్దముండాదాన్ని నా మాట ఎవరు వింటారూ?" అని వరహాలు బామ్మ సాగదీస్తుండగానే, "వెంకటలక్ష్మి జాతకం బాలేదటగా .. పెళ్ళయితే అత్తగారికి గండం అటగా, వాళ్ళు అనుకుంటుంటే విన్నాను." అని పాడి వేసి "నాకు నిద్దరొస్తోంది ఏవర్రోయ్ పై బెర్తు మీదకి ఎక్కలేను కింద బెర్తు ఎవరైనా ఇవ్వండి పుణ్యం ఉంటుంది" అని జారుకుంటుంది.

"నా మనవరాలి జాతకం బ్రహ్మాండంగా ఉంది. చేసుకోకపోతే చేసుకోపోయారు. ఇంత అపవాదు వేస్తారా?" అని వరహాలు బామ్మ ముక్కు చీదుతూ, తనకి దుప్పటి కప్పడానికి వచ్చిన కూతురు విశాలాక్షి చెవిన ఈ వార్త ఊదుతుంది.

ఇవేవీ తెలీని రామారావు అందరి దగ్గరగా వచ్చి "ప్రొద్దుటే లేవాలి పడుకోండి. అందరికీ పులిహోర పొట్లాలు వచ్చాయా?" అని అడుగుతుంటాడు.

"ఆ. ఆన్నీ వచ్చాయి మా మొహాలకి. లేనిపోని మాటలు కూడానూ!" అని విశాలాక్షి సణుగుతుంది.

బుడిబుడి రాగాలు తీస్తూ భర్తకి ఇదంతా చెపుతున్న విశాలాక్షి మాటలు విని ఎదుటి బెర్తు కామాక్షి పెద్దమ్మ నిద్రమత్తంతా వదిలి లేచి కూర్చుని "ఏవైందే విశాలీ?" అని అడుగుతుంది.

"నీ కడుపులో పెట్టుకో పెద్దమ్మా" అంటూ విశాలి ఇదంతా ఆవిడకి చెపుతుంది.

ప్రొద్దుటే, మొహాలు కడుక్కుంటుంటే పరాంకుశం బాబాయ్ "ఏమ్మా విశాలా? ఇంతమాట అన్నాడా రామారావు? కట్నం కోసం ఆశపడి బయట సంబంధం చేసుకుంటూ మన వెంకటలక్ష్మిని ఇంతమాట అంటాడా? పెళ్ళిలో వాళ్ళేపాటి మర్యాదలు చేస్తారో మనమూ చూద్దాం. నువ్వేం కంగారు పడకమ్మా" అంటాడు.

ఇవేమీ తెలీని రామారావు లగేజీలు లెఖ్ఖపెడుతుంటాడు.

అతని పెళ్ళాం జానకి "కాఫీ, ఫలహారాలు దిగగానే సిద్ధం చేయిస్తారు. ఇక్కడేం కొనుక్కు తినకండి" అని అమాయకంగా చెపుతుంటుంది.

ఎదుర్కోలుకి ఆడ పెళ్ళివారు రైలు దగ్గరకి వచ్చేసరికి, రైల్లో రామారావు బంధువర్గం రెండు వర్గాలుగా విడిపోయి, మూడో వర్గం వారిని ఎదుర్కోడానికి సిద్ధంగా ఉంటారు.

విడిదిలో దిగాకా, పెద్దమావయ్య "నేను కాఫీ తాగను. హార్లిక్స్ కావాలి అని చెప్పి అరగంట అయింది. ఇంకా రాలేదు. అది వేడిగా నోట్లో పడకపోతే నాకు పనికాదు. ఇదేనటోయ్. వియ్యాలవారికి చేసే మర్యాదలూ?" అని ఎగురుతుంటాడు.

"ఇక్కడ బాత్ రూములో సబ్బులేదు. కొనుక్కురారా బాబీ! ఇది కూడా పెట్టలేదు ఆడపెళ్ళివారు" అని సుబ్బలక్ష్మి అరుస్తుంటుంది.

"జానకి పిన్ని పెట్టిన చీర చూసావా? వెళ్ళగానే స్టీలు సామాన్ల వాడికి వేసేస్తాను. మా పనిమనిషి కూడా కట్టదు ఆ చీర." అని రత్నప్రభ తన అక్కతో చెపుతుంటుంది.

"పులుసులో బెల్లం వేసారు. తూర్పు సంబంధం వద్దంటే విన్నావుకాదు" అని పరాంకుశం బాబాయ్ గొడవచేస్తుంటాడు.

"కూల్ డ్రింక్స్ అందరికీ లేవా? వి.ఐ.పీలకేనా? నా దాకా వచ్చేసరికి అయిపోయాయి అన్నారు అంటూ పరుశురాం మావయ్య నిప్పులు తొక్కుతుంటాడు.

"నా కాసుల పేరు కనపడడం లేదు. ఎవరో దొంగలు ఇక్కడే ఉండి ఉంటారు. పట్టుకోండి"

అని వరహాలు బామ్మ రాగం అందుకుంటుంది.

"అదే నేనైతే ఐదు రోజుల పెళ్ళి, తాశిల్దారు లెవెల్‌లో మనం ఉన్న చోట జరిపించేవాడిని" అని విశాలాక్షి భర్త సుబ్బారావు నాలుగోసారి కాఫీ తాగి ఉపన్యాసం ఇస్తుంటాడు.

ఇలా రైలెక్కే ముందు ప్రేమగా ఉన్న తనవాళ్ళంతా.. శత్రువుల్లా ఎందుకు ప్రవర్తిస్తున్నారో తెలీక రామారావు ఆడపెళ్ళివారి ముందు కళవెళ పడ్తుంటాడు. ఏమాటన్నా తప్పే. "అప్పుడే ఆడపెళ్ళివారు స్వంతవాళ్ళూ, మేం పరాయి వాళ్ళమూ అయిపోయామా?" అని బంధువులు తగాదాకి దిగుతారు.

ఇదంతా నేను సరదాకి రాసాను.

ఏగొడవైనా ఆర్థిక వ్యవహారాల వల్లే వస్తాయి. మానవ సంబంధాలనీ అర్థిక సంబంధాలు అని నేను అనను కానీ, మానవ సంబంధాల పైన ఆర్థిక పరిస్థితి ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

ఒకచోటు బంధువులు నలుగురూ చేరినప్పుడేగా, ఏ ఇంట్లో ఏ కుంపటి రాజుకుంటుందో తెలిసేది! ఒకరి బలహీనతలు ఒకరికి తెలిసేది. ఎప్పుడో ఓ గంట కలిసినప్పటికీ, కలిసి ఒక కప్పుకింద ఉండడానికీ చాలా తేడా ఉంది.

"మీనాక్షి అత్త గురక పెడుతుంది"

"కామేశం బావ మోటసరసాలు చేస్తాడు"

"పరుశురాం మావయ్య పర్సు తియ్యడు కానీ అన్నీ కొనమంటాడు."

"సీత పిన్ని పాటలు వినలేక చస్తున్నాం"

"రాఘవగాడు జోక్స్ అన్నీ మనం చిన్నప్పటినుండీ విన్నవే! పట్టుకుంటే వదిలి పెట్టడు"

"విమల పిన్నికి అన్నీ వెటకారాలే"

"సుబ్బారావు పెద్దనాన్నకి గొప్పలు ఎక్కువ. వినలేక చస్తున్నాం"

ఈ టైప్‌లో ఒకళ్ళ గురించి ఒకళ్ళు మాట్లాడుకునేదీ, తెలుసుకునేదీ ఇలా కలసి వెళ్ళినప్పుడే

అక్కడక్కడ పోట్లాటలూ, చెదురు మదురుగా శోకాలుతో సందడిగా తిరుగు రైలు ఎక్కేదాకా సాగుతుంది. కానీ ఈ ప్రభావం పెళ్ళికి వెళ్ళొచ్చిన తరువాత కొద్దికాలందాకా ఉంటుంది.

"అబ్బా! ఆ రామారావు మావయ్య ఇంటి వద్దే అమ్మా. వాళ్ళు ఒక రకం మనుషులు"

"అబ్బా. సుబ్బులు పిన్ని చూస్తే దిష్టి కొడుతుంది. వాళ్ళ ఇంటికి తయారయి వెళ్ళకు" అంటూ కొంతకాలం ఈ మనస్పర్థలు కొనసాగుతాయి.

చాలాచాలా గొప్పవాళ్ళకి ఇలాంటి గొడవలు రాకపోవచ్చు. గొప్పగొప్ప గొడవలు రావచ్చు. కానీ మధ్యతరగతీ, క్రింద తరగతి కుటుంబాల్లో ఈ మోస్తరు మాటలూ, గొడవలూ వచ్చే ఆస్కారం ఉంటుంది!

అలాగే ప్రేమలూ ఉంటాయి.

ఏ పెళ్ళిలోనో మళ్ళీ కలిస్తే ఈ పాత మాటలన్నీ మర్చిపోయి కౌగలించుకుని "ఎన్నాళ్ళయిందిరా చూసి?" అంటారు.


"పరాంకుశం మావయ్య హార్లిక్స్ తాగాడా? లేకపోతే గొడవ పెడతాడు" అనగానే అందరితో బాటూ పరాంకుశం మావయ్యా కూడా నవ్వేస్తాడు!

గాలివాటుగా నచ్చిన గొడవలు గాలివాటుగానే పోతాయి.

ఒకచోట అందరూ చేరితేనే బాండింగ్ ఉంటుదనేది నిజమైతే ఒకచోట అందరూ చేరినప్పుడే అనవసరమైన మాటలు విసురుకుంటారు అనేదీ నిజమే. (పనిలేకపోవడం ముఖ్యకారణం) మన టీ.వీల్లో ప్రసారమయ్యే సీరియల్స్‌లో కూడా మొదటి ఎపిసోడ్‌లో ఒక పాతికమంది వెకిలిగా ఒకర్ని చూసి ఒకరు నవ్వుకునే వాళ్ళతో, ఉమ్మడి కుటుంబం చూపిస్తారు. ఆ తరువాత ఒకరంటే ఒకరికున్న ప్రేమలు పది ఎపిసోడ్లు చూపిస్తారు. తరువాత చిన్న చిన్న గొడవలు. అతి త్వరలోనే విలన్లలాంటి కొత్తకోడళ్ళో, అత్తగార్లో, పక్కింటి పార్వతమ్మతో, ఇంటికొచ్చిన రావు గోపాలావులో ఎంటర్ అయి అంతా విడిపోయినట్లు చూపిస్తారు. అక్కడ నుండీ ఏడుపులే!

ఎందుకంటే టీ.వీలు ఉన్నదే Entertainment... Entertainment ... Entertainment కోసం.

Click here to share your comments on this serial


కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
2007
చలన చిత్ర నంది బహుమతులు
బలభద్రపాత్రుని రమణి
కాలమ్ దాటని కబుర్లు
సాహితి
సాహితి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి